క్రీడా స్ఫూర్తితో మెలగాలి

శ్రీకాకుళం అర్బన్ : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా ముందుకు వస్తేనే క్రీడల అభివృద్ధి సాధ్యమన్నారు. ఆటలో గెలుపోటములు సహజమని, ఆ రెండింటినీ సమానంగా స్వీకరించాలని సూచించారు. ఓటమి అనుభవం తదుపరి విజయానికి నాంది అని అన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, పూడి తిరుపతిరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ, తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తైక్వాండో శ్రీను, జర్నలిస్టు సంఘాల నాయకులు కె.వేణుగోపాల్, ఎస్.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విషాదం

- విజయనగరం జిల్లాలో రైలు ప్రమాదం
- జి.సిగడాంకు చెందిన మహిళ మృతి
- ఏడుగురికి గాయాలు
- ఆమదాలవలస, పలాసలో నిలిచిన రైళ్లు

ప్రజాశక్తి - జి.సిగడాం, ఆమదాలవలస, పలాస

విజయనగరం జిల్లా కొత్తవలస మండలం అలమండ-కంటకాపల్లి వద్ద సిగ్నల్ కోసం ఆగిన విశాఖ-పలాస పాసింజరు రైలును అదే సమయంలో దాని వెనకాలే వస్తున్న విశాఖ-రాయగడ పాసింజరు రైలు ఆదివారం ఢీకొట్టింది. ఈ ఘటనలో జి.సిగడాం మండలం ఎస్‌పిఆర్ పురం అగ్రహారానికి చెందిన గిడిజాల లక్ష్మి (45) ఆదివారం మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన కీర్తి రాములమ్మ, టంకాల సుసనమ్మ, మెట్టవలసకు చెందిన డెంక అప్పన్నమ్మ, జి.సిగడాంకి చెందిన మజ్జి అమృత, మోక్ష, రమణ, సూర్యకాంతంకు తీవ్ర గాయాలయ్యాయి. జి.సిగడాం మండలం ఎస్‌పిఆర్ పురం అగ్రహారానికి చెందిన గిడిజాల లక్ష్మి, అదే గ్రామానికి చెందిన కీర్తి రాములమ్మ, టంకాల సుసనమ్మ, మెట్టవలసకు చెందిన డెంక అప్పన్నమ్మ, జి.సిగడాంకి చెందిన మజ్జి అమృత, మోక్ష, రమణ, సూర్యకాంతం విశాఖపట్నంలో ఒక ఫంక్షన్‌కు వెళ్లారు. ఫంక్షన్ పూర్తయ్యాక సాయంత్రం విశాఖపట్నం నుంచి పలాస వెళ్లే పాసింజరు రైలు ఎక్కారు. ఆ రైలును అలమండ-కంటకాపల్లి వద్ద విశాఖ-రాయగడ పాసింజరు రైలు ఢీకొట్టడంతో మూడు బోగీలు పట్టాలు తప్పి చెల్లాచెదురయ్యాయి. ఆ బోగీల్లో ప్రయాణిస్తున్న గిడిజాల లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. కీర్తి రాములమ్మకు రెండు కాళ్లు, టంకాల సుసునమ్మకు ఒక కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వీరితో పాటు గాయాలపాలైన డెంక అప్పనమ్మ, మజ్జి అమృత, మోక్ష, రమణ, సూర్యకాంతంను రైల్వే పోలీసు, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది కొత్తవలస పిహెచ్‌సికి తరలించారు. మృతురాలు లక్ష్మికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. పాసింజరు రైలు కావడంతో ప్రయాణికుల వివరాలు తెలుసుకోవడం రైల్వే అధికారులకు కష్టంగా మారింది. లక్ష్మి మృతితో ఎస్‌పిఆర్ పురం అగ్రహారంలో విషాదఛాయలు అలముకున్నాయి.

హెల్ప్‌లైన్ నంబర్లు

రైలు ప్రమాద దుర్ఘటన నేపథ్యంలో రైల్వే అధికారులు హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో 08942-286213, 286245, 8591185912, 8591385914, పలాస రైల్వేస్టేషన్‌లో 8895670954 నంబరుతో హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేశారు. సమాచారం కోసం ఈ ఫోన్ నంబర్లను సంప్రదించాలని రైల్వే అధికారులు సూచించారు. తమ వారి ఆచూకీ కోసం పలువురు పలాస రైల్వేస్టేషన్‌కు చేరుకుని సహాయక కేంద్రం వద్ద ఆరా తీశారు.

ఆమదాలవలస, పలాస రైల్వేస్టేషన్లలో నిలిచిన రైళ్లు

కోల్‌కతా-చెన్నై ప్రధాన మార్గంలో రైలు ప్రమాదం సంభవించడంతో పలు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలును శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. పూరీ-చైన్నై ఎక్స్‌ప్రెస్ రైలును పలాసలో నిలిపివేశారు. రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. రైళ్లు నిలిపివేయడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చంటి పిల్లలతో రైలులో ఉండలేక ప్లాట్‌ఫాం పైకి దిగి విశ్రాంతి తీసుకుంటున్నారు. భువనేశ్వర్ వైపు వెళ్లే ప్రయాణికులు అటువైపు రైళ్లు రాకపోవడంతో రైల్వేస్టేషన్లలో వేచి చూశారు.

ఆమదాలవలస : ప్లాట్‌ఫారంపై ఉన్న ప్రయాణికులు

అరాచక పాలనకు అంతం తప్పదు

- నాలుగున్నరేళ్లుగా జగన్ రాష్ట్రాన్ని దోచుకున్నారు
- చంద్రబాబును ఎదుర్కోలేక అక్రమ అరెస్టు
- టిడిపి, జనసేన సమన్వయ కమిటీ సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలన వచ్చే ఎన్నికల్లో అంతం కాక తప్పదని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసమే టిడిపి, జనసేన ముందుకు కలిసి సాగుతున్నాయని చెప్పారు. నగరంలోని ఒక హోటల్‌లో టిడిపి, జనసేన సమన్వయ కమిటీ సమావేశాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా జగన్ రాష్ట్రాన్ని లూటీ చేసి, పేదలకు బతుకు లేకుండా చేశారని ఆరోపించారు. దోచుకోవడానికే తన పదవిని వినియోగించుకున్నారని, నమ్మిన ప్రజలను నట్టేట ముంచారన్నారు. సంక్షేమ పథకాల పేరు చెప్పి ధరలు, పన్నుల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. స్కిల్ స్కామ్‌గా చెప్తున్న వైసిపి నాయకులు ఎక్కడ అవినీతి జరిగి ఎవరికి డబ్బులు వెళ్లాయో చెప్పగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబుని ఎదుర్కోలేక అక్రమంగా అరెస్టు చేశారని చెప్పారు. టిడిపి, జనసేన కలిస్తే చిత్తు చిత్తుగా ఓడిపోతామనే భయంతో వైసిపి నాయకులు కుట్రలు పన్నుతున్నారన్నారు. ఓటమి భయంతోనే ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నామని చెప్పారు.

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వంగలపూడి అనిత మాట్లాడుతూ జగన్ బాబా 151 మంది దొంగలు బస్సులు వేసుకుని యాత్రల పేరిట తిరుగుతున్నారని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిల తన వాళ్లని వేదికలపై జగన్ చెప్తారని, పదవులు మాత్రం రెడ్లకు ఇచ్చారన్నారు. వ్యవస్థల మేనేజ్ గురించి విజయసాయిరెడ్డి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసి పదేళ్లుగా బెయిల్‌పై బయట తిరుగుతున్నదెవరని ప్రశ్నించారు. సొంత బాబాయిని చంపిన వారిని శిక్షించలేని వారు ప్రజలకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. పొత్తుల సమయంలో త్యాగాలు అవసరమని, సీట్ల పంపకాల విషయంలో అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

టిడిపి, జనసేనకు పట్టం కట్టాలి

జనసేన సమన్వయకర్తలు బొమ్మిడి నాయకర్, పాలవలస యశస్వి మాట్లాడుతూ రోజురోజుకూ వైసిపి అరాచకాలు పెరిగిపోతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల బతుకులు మారాలంటే జనసేన, టిడిపి ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు. వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ నినాదమే ప్రధాన అజెండా కావాలన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి భూ కబ్జాలు చేస్తున్న మంత్రి అప్పలరాజుకు లేదన్నారు. అప్పలరాజు ఎక్కడ పోటీ చేసినా ఓడించి తీరుతామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణ, బగ్గు రమణమూర్తి, కె.మురళీమోహన్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, జనసేన నాయకులు గేదెల చైతన్య, విశ్వక్‌సేన్, కోరాడ సర్వేశ్వరరావు, పేడాడ రామ్మోహన్, కణితి కిరణ్, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

2న ప్రజా రక్షణ భేరి

- బస్సు యాత్రను జయప్రదం చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ప్రజా రక్షణ భేరి బస్సుయాత్రను నవంబరు రెండో తేదీన మందసలో ప్రారంభించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు తెలిపారు. సిపిఎం అఖిల భారత నాయకులు విజూ కృష్ణన్ ప్రారంభించే ఈ యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో నంబూరు షణ్ముఖరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతల్లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యాన కర్నూలు జిల్లా ఆదోని, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో బస్సు యాత్రలు ప్రారంభమై, రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తూ నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు అత్యధిక ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి పాలనలో మొత్తం దేశం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. మత విద్వేషాలు సృష్టిస్తున్న బిజెపి ప్రభుత్వం దేశ సంపదనంతా అదానీ, అంబానీలకు దోచిపెడుతోందని విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు అంటకాగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ప్రధానమైన కృష్ణపట్నం, గంగవరం పోర్టులతో పాటు రాష్ట్ర సంపద అంతా ఒక్కొక్కటిగా అదానీకి కట్టబెడుతున్నా వైసిపి, టిడిపి పల్లెత్తి మాట్లాడటం లేదని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం మేజరు పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, రైల్వేజోన్ వంటి విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన బిజెపి, అంతటితో ఆగకుండా మన రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గుండెకాయ వంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి తయారైందని విమర్శించారు. సమావేశంలో సిపిఎం నాయకులు హనుమంతు ఈశ్వరరావు, బి.వాసు, పోలయ్య, బొంతు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోవిందరావు

నిజం గెలిస్తే బాబుకు జీవితాంతం జైలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి చెప్పినట్లు నిజం గెలిస్తే చంద్రబాబు జీవితాంతం జైలు జీవితం గడపాల్సి ఉంటుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం వ్యాఖ్యానించారు. సరుబుజ్జిలి మండల కేంద్రంలో రూ.61.80 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అడ్డంగా దొరికిపోయి దాన్ని కప్పిపుచ్చుకునేందుకు బూటకపు యాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు. 2018లో టిడిపి హయాంలోనే ఈ కేసు నమోదైందని తెలిపారు. చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని టిడిపి నాయకులు అంటున్నారని, అందరం అదే కోరుకుంటున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డిపై 18 కేసులు పెట్టి 18 నెలలు జైల్లో ఉంచారని, చివరికి రుజువు చేయలేక సిబిఐ కూడా చేతులెత్తేసిందన్నారు. కడిగిన ముత్యమంటే జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. చంద్రబాబు నిజాయతీపరుడైతే, నిజమే గెలవాలంటే ఆయన కేసులపై స్టేలను ఎత్తేసి బయటకు రావాలని సవాల్ విసిరారు. చంద్రబాబును జగన్మోహన్ రెడ్డి అరెస్టు చేయించలేదని, కేంద్ర ప్రభుత్వ సంస్థలైన జిఎస్‌టి, సెబీ, ఇడి వంటి దర్యాప్తు సంస్థలు స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి చోటుచేసుకుందని చెప్పాక రాష్ట్ర ప్రభుత్వం సిఐడికి కేసును అప్పగించిందన్నారు. చంద్రబాబు కేసుల్లో ఇరుక్కుని కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ప్రముఖ న్యాయవాదులతో వాదించినా బయటకు రాలేకపోయారని చెప్పారు. భువనేశ్వరి కోరుకుంటున్నట్లు నిజమే గెలుస్తుందని, రానున్న రోజుల్లో ఒకటి తర్వాత ఒకటి వరుసగా వస్తాయన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణలో బిజెపికి మద్దతిస్తుంటే, ఆయన దోస్త్ చంద్రబాబు నాయుడు అక్కడి ఎన్నికల్లో పోటీ చేయకుండా ఓటుకు నోటు కేసులో తోడు దొంగ అయిన రేవంత్ రెడ్డి పార్టీ కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఇంటి తలుపు తట్టి సంక్షేమ పథకాలు అందిస్తూ నిజాయితీగా పనిచేస్తున్న తాము ఎవరికీ భయపడాల్సిన పనిలేదన్నారు. పవన్ కళ్యాణ్ కాదని, ఎంతమంది కళ్యాణ్‌లు వచ్చినా తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, ఎంతమంది వస్తారో రావాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ సంవత్సరానికి 36 సార్లు పథకాలకు బటన్ నొక్కి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ప్రజలందరూ వచ్చే ఎన్నికల్లో ఒక్కసారి బటన్ నొక్కి జగన్మోహన్ రెడ్డికి ఓటు వేసి ఆయన్ను గెలిపిస్తే, ప్రజలందరూ మళ్లీ ఐదేళ్లపాటు సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ, వైస్ ఎంపిపి గోవింద వెంకట శ్రీరామ్మూర్తి, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బద్రి రామారావు, సర్పంచ్ బొడ్డేపల్లి వెంకట సూర్యచాందిని, వైసిపి నాయకులు ఎ.శ్రీకాంత్, బొడ్డేపల్లి హరి, పెద్ది రాజేష్, మూడడ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

అలజడి

ప్రజలను అప్రమత్తం చేస్తున్న అటవీ సిబ్బంది

- పలు గ్రామాల్లో పెద్దపులి అడుగులు
- భయాందోళనలో ఉద్దానం ప్రజానీకం

ప్రజాశక్తి - కవిటి

జగతిలో పులి అడుగులు

పచ్చని ప్రకృతి అందాలతో, ప్రశాంతంగా ఉండే ఉద్దానం ప్రాంతం... పెద్దపులి సంచరిస్తుందన్న వార్తలతో అలజడి రేగుతోంది. కంచిలి మండలంలోని మండపల్లి, అమ్మగారిపుట్టుగ, బంజరి నారాయణపురం తదితర గ్రామాల్లో శనివారం పెద్దపులి అడుగులు గుర్తించిన అటవీ శాఖ అధికారులు ఆదివారం ఉదయం కవిటి మండలం బెజ్జిపుట్టుగ, జగతి, కవిటి, పుక్కళ్లపాలెం తదితర గ్రామాల్లో గుర్తించారు. పుళ్ళల్లపాలెం తీరంలోని రంగాల గెడ్డలో నీరు తాగిన పెద్దపులి తీరంలోని దట్టమైన ముళ్లపొదల్లో ఉన్నట్లు అటవీ సిబ్బంది అనుమానిస్తున్నారు. దీంతో ఉద్యాన ప్రాంతమైన కవిటి మండలంలో పెద్దపులి సంచారంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని రైతులు, కూలీలు, ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. మూడు రోజులుగా అలజడి రేపుతున్న పెద్దపులి ఇంతవరకు ఎక్కడా, ఎవరికీ కనిపించకపోవడం, పులి ద్వారా ఇప్పటివరకు ఎటువంటి హాని లేకపోవడంతో ఇప్పటివరకు ఊరటగా అనిపిస్తోంది. పెద్దపులి సంచారం నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ శాఖలు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు ఇచ్చిన సమాచారం చేరవేస్తూ గ్రామాల్లో దండోరా వేయించారు. అటవీశాఖ ఎఫ్ఎస్ఒ రాఘవయ్య, రాజు, రెడ్డి, ఎఫ్‌డిఒ సంతోష్ కుమార్, ఎ.రవి మత్స్యకార గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ నిరంతరం పెద్దపులి కదలికలపై నిఘా వేసి ఉంచారు. మరోవైపు ఇటువంటి ఆందోళనకర పరిస్థితుల్లో కొందరు ఆకతాయిలు ఫొటో మార్ఫింగ్‌లతో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తూ స్థానికులను హడలెత్తిస్తున్నారు. శనివారం సాయంత్రం కొబ్బరి తోటల్లో పులి తిరుగుతున్నట్లు, రాత్రి తొమ్మిది గంటల తర్వాత బల్లిపుట్టుగ, బొరివంక గ్రామాల్లో రోడ్డు దాటుతున్నట్లు ఫొటోలు మార్ఫింగ్ చేసి పోస్టులు చేస్తూ మరింత భయాందోళనలకు గురిచేస్తున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే తప్పుడు పోస్టులు పెట్టవద్దని అధికారులు చెప్పారు.

బెజ్జిపుట్టుగలో పులి అడుగులు గుర్తిస్తున్న అటవీ సిబ్బంది

117 జిఒతో విద్యారంగం నాశనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జిఒతో విద్యారంగం నాశనమవుతుందని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు అన్నారు. తక్షణమే ఈ జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతిభవన్‌లో సంఘ జిల్లా అధ్యక్షులు పడాల తమ్మినాయుడు అధ్యక్షతన కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 117 జిఒతో ఉపాధ్యాయులను తగ్గించి, పాఠశాలలను క్రమంగా మూసివేసే ప్రమాదం పొంచి ఉందన్నారు. దుర్మార్గమైన ఈ ఉత్తర్వుల వల్ల నాడు-నేడులో రూ.లక్షలు ఖర్చు పెట్టిన పాఠశాలలూ మూతపడనున్నాయని చెప్పారు. తమ్మినాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని హామీనిచ్చారని, అధికారంలోకొచ్చాక అంతకంటే దుర్మార్గమైన జిపిఎస్ విధానాన్ని తీసుకొస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం చేకూర్చే జిపిఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిపిఎస్‌ను తీసుకురావడం వెను ప్రభుత్వ వాటా అయిన 14 శాతాన్ని ఎగ్గొట్టే దురుద్దేశం దాగి ఉందన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులు దాచుకున్న డబ్బును వారి అవసరాలకు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. మరోవైపు జీతం ఎప్పుడు ఇస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. ఉపాధ్యాయ వ్యవస్థలో ఎంటిఎస్ విధానాన్ని రద్దు చేసి 1998, 2008 డిఎస్‌సి అభ్యర్థులను బేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు సన్యాసిరావు, జి.రమణ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

జగనాసురునికి ప్రజలు బుద్ధి చెప్తారు

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న జగనాసురునికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్తారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ కళ్లు తెరిపిద్దాం పేరిట కళ్లకు గంతలు కట్టుకుని నిజం గెలవాలని నినాదాలు చేస్తూ పట్టణంలోని ఒన్‌వే సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.లక్షల కోట్లు దిగమింగినట్లు ఆధారాలతో సహా నిరూపణ అయి 16 నెలలు జైల్లో ఉన్న జగన్మోహన్ రెడ్డి, అందరినీ తనలాగే చిత్రీకరించాలన్న దురుద్దేశంతో చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసు పెట్టారని ఆరోపించారు. చంద్రబాబును జైల్లో పెట్టి 50 రోజులైనా ఒక్క ఛార్జిషీట్‌నైనా ఫైల్ చేశారా అని ప్రశ్నించారు. మొదట రూ.మూడు వేల కోట్లు అవినీతికి పాల్పడ్డారని, తర్వాత రూ.271 కోట్లు, ఆ తర్వాత రూ.27 కోట్లు అంటూ పూటకో మాట మాట్లాడుతూ పబ్బం గడుపుతున్నారని ధ్వజమెత్తారు. జగన్‌కు దమ్ము ఉంటే సిబిఐ ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని కోర్టును కోరాలని సవాల్ విసిరారు. పదేళ్ల పాటు ఏ వ్యక్తి బెయిల్‌పై ఇంతవరకు లేరన్నారు. సిఎంగా ఉన్నానన్న సాకుతో కోర్టు మెట్లు ఎక్కకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. సొంత బాబాయ్ వివేకానంద రెడ్డిని చంపిన అవినాష్ రెడ్డి, లక్ష కోట్లు మింగిన జగన్మోహన్ రెడ్డి బెయిల్‌పై ఉండవచ్చు గానీ ఇంకెవరూ ఉండకూడదా అని ప్రశ్నించారు. న్యాయం ఆలస్యం కావచ్చు గానీ చివరకు గెలిచేది న్యాయమేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి పట్టణ అధ్యక్షులు ఎస్.మురళి, నాయకులు బోర గోవిందరావు, తమ్మినేని అప్పలనాయుడు, బి.వి రమణమూర్తి, లంక నాగరాజు, ఎన్.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నినాదాలు చేస్తున్న టిడిపి నాయకులు

జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం

ప్రజాశక్తి - పలాస

సామాజిక న్యాయం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నవంబరు 3న చేపట్టే సామాజిక సాధికార బస్సు యాత్ర సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను యాత్రలో వివరించనున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు అన్ని పదవుల్లో సముచిత స్థానం కల్పించిందన్నారు. ఆయా తరగతుల సంక్షేమానికి పలు పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో ఒక్క మైనార్టీకి కేబినెట్‌లో చోటు కల్పించలేదన్నారు. అలాంటి పార్టీ అన్నీ చేస్తున్న వైసిపి ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు వాస్తవాలను వివరించాలన్నారు. సామాజిక సాధికారతకు జగన్ నాంది పలికారని కొనియాడారు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు నిర్మించి గ్రామ పరిపాలనా దిశగా అడుగులు వేశారన్నారు. ఏ పథకం కావాలన్నా ఎక్కడో దూరాన ఉన్న మండల కార్యాలయాలకు, జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగనవసరం లేకుండా అర్హతే ప్రామాణికంగా వారి గ్రామాల్లోనే అందిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల మూడో తేదీన చేపట్టే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు, నియోజకవర్గంలోని ముడు మండలాల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

బొడ్డపాడులో పాడైన వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు

రైతుల గోడు పట్టదా?

ప్రజాశక్తి- పలాస

మంత్రులకు, ఎమ్మెల్యేలకు తమ రాజకీయం, అధికారం కోసం బస్సు యాత్రలు చేస్తున్నారే తప్ప రైతుల గోడును ఎందుకు పట్టించుకోవడం లేదని వామపక్ష నాయకులు ప్రశ్నించారు. మండలంలోని బొడ్డపాడు, మందస మండలంలోని రఘునాథపురం గ్రామాల్లో ఎండిపోతున్న వరి పంటలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో కరువు విలయతాండవం చేస్తుంటే అధికారులు, పాలకులు నిమ్మకునీరెత్తినట్లు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాళ్లం కష్టపడ్డా రైతుకు కన్నీళ్లే మిగిలాయని అన్నారు. ఎసి బస్సుల్లో తిరుగుతున్న మంత్రులకు రైతు గోడు పట్టదా? అని ప్రశ్నించారు. రైతు పక్షపాత ప్రభుత్వం అని చెప్పుకొని గద్దెనెక్కిన వైసిపి నాయకులు నాలుగున్నరేళ్లుగా పంటకు నీరు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. కనీసం కాలువల్లో పూడికలు తీయ్యకుండా చెరువులు, చెక్‌డ్యాం కూడా బాగుచేసుకొనే దుస్థితి ఉందన్నారు. వంశదార, కలింగదల్, డబారుసింగు, సంకుజోడు లాంటి ఎన్నో నీటి వనరులు ఉన్నా ఈ నియోజకవర్గంలో రైతులకు ఈ పరిస్థితి రావడం అంటే అది ముమ్మాటికీ రాజకీయ నాయకుల అలసత్వం, చేతకాని తనమని చెప్పక తప్పదన్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలు మదుపు పెట్టీ రైతులు నష్టాల్లోకి కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నాయకులు చొరవ చూపి అధికారులతో సమగ్రమైన నివేదిక తీసుకొని పంటలు నష్టపోయిన రైతాంగానికి యుద్ధప్రతిపాదికనున ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో చాపర వెంకటరమణ, వంకల మాధవరావు, మద్దిల రామారావు, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, ఎంవినోద్ పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యంతో సుడిదోమ నివారణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఇటీవల కాలంలో జిల్లాలో అన్ని ప్రాంతాల్లో సుడిదోమ తాకిడి పెరిగింది. సుడిదోమను తట్టుకోని రకాలైన స్వర్ణ (ఎంటియు 7029) సాంబ మసూరి (బిపిటి 5204), ఇతర ప్రయివేటు వరి వంగడాలు సాగుచేస్తున్న రైతుల క్షేత్రాల్లో దోమ ఉధృతిని గమనించగా వరి పైరును ఆశించే పురుగుల్లో ఎక్కువ నష్టాన్ని కలుగజేసింది సుడిదోమ. మండలంలో కలివరం, తొగరాం, దూసి, శ్రీనివాసాచార్యులపేట, రామచంద్రాపురం, దండేవలస, నెల్లిపర్తి గ్రామాల్లో సుడిదోమ వ్యాపించింది. ఈ సుడిదోమ వల్ల కలిగే నష్టం దాని నివారణకు తీసుకోవాల్సిన సూచనలు రైతులు తెలుసుకోవాలి. వరి పంటను రెండు రకాల దోమలు ఆశించి నష్టపరుస్తాయి. గోధుమ వర్ణపు దోమ, తెల్లవీపు మచ్చ దోమ, గోధుమ వర్ణపు దోమలు సంవత్సరం పొడవునా ఆశిస్తుంది. వీటి ఉధృతి సార్వా పంటల్లో అక్టోబరు, నవంబరు నెల్లోనూ దాల్వా పంటల్లో మార్చి, ఏప్రిల్ నెలల్లోనూ ఎక్కువగా ఆశిస్తాయి.

వరి చేనుకు మందును పిచికారీ చేస్తున్న రైతు

గోధుమ వర్ణపు దోమ

గోధుమ వర్ణపు దోమ నీటి వసతి గల ప్రాంతాల్లో పంట అంకురార్పణ దశ నుంచి ఎక్కువగా ఆశిస్తుంది. తల్లి పురుగుల్లో రెండు రూపాంతరాలు ఉంటాయి. అవి పొడుగాటి రెక్కలు గలవి (మాక్రో ప్టేరస్), పొట్టి రెక్కలు గలవి. ఇందులో పొడుగాటి రెక్కలు గలవి వలస పోగల శక్తి కలిగి కొత్త ఆవాసాలను ఏర్పరచుకుంటాయి. ఈ దోమలు గుడ్ల సముదాయాలను (2-12 గుడ్లను) కాండం ఒరలలో, కాండం కణజాలంలో చూపిస్తాయి. ఇవి ఒకదానిలో ఒకటి అతుక్కుని ఉంటాయి. పొట్టి రెక్కలు గల ఆడ దోమలు 300-350 వరకు గుడ్లు పెడతాయి. ఈ గుడ్లు ఆరు నుంచి తొమ్మిది రోజుల్లో పొదగబడి గుడ్ల నుంచి వెలువడిన పిల్ల పురుగులు తెలుపు రంగులో ఉండి ఐదు దశల్లో పెరిగి 10 నుంచి 18 రోజుల్లో గోధుమ వర్ణంలోకి మారతాయి. ఈ దోమలు తమ జీవిత కాలాన్ని 12 నుండి 23 రోజుల్లో పూర్తి చేసుకుంటాయి.

పురుగు ఆశించిన లక్షణాలు

గోధుమ వర్ణపు దోమ నీటి వసతి గల ప్రాంతాల్లో పంట అంకురార్పణ దశ నుంచి ఎక్కువగా ఆశిస్తుంది. పిల్ల, తల్లి దోమలు నీటి పైభాగాన దుబ్బులు మొదళ్ల దగ్గర నుంచి పోషకాలు సరఫరా చేసే కణజాలం నుంచి రసాన్ని పీల్చడం వల్ల మొక్కలు మొదట పసుపు రంగుకు మారి క్రమేపీ పైరు సుడులు సుడులుగా ఎండిపోతుంది. ఈ విధంగా పొలంలో మొక్కలు ఎండిపోవడాన్ని సుడి తెగులు అని పిలుస్తారు. సుడి దోమ యాజమాన్యంలో భాగంగా రైతు సోదరులు కొన్ని చేయకూడని అంశాలు ఉన్నాయి. సుడిదోమ ఉధృతికి దోహదపడే పురుగు మందులు ప్రొఫెనోఫాస్, సైపరమిథ్రిన్, డెల్టా మిథ్రిన్, ట్రైజోఫాస్, మరియు ఫోరట్ 10జి గుళికలు వాడరాదు. వివిధ రకాల పురుగు మందుల మిశ్రమాన్ని విచక్షణారహితంగా వాడరాదు. పురుగు మందులతో పాటు ఎటువంటి పోషకాల మిశ్రమాలు, జీవ నియంత్రకాలను కలిపి పిచికారీ చేయరాదు. నత్రజనికి ఇచ్చే అధిక రసాయనిక ఎరువులు వినియోగించరాదు.

సుడిదోమ నివారణ ఇలా...

పొలాన్ని అడపా దడపా ఆరబెట్టాలి. నత్రజని ఎరువులను సిఫార్సు మేరకే వాడాలి. ఆర్థిక నష్ట సహన పరిమితి స్థాయికి దోమ ఉధృతి ఉన్న ఎడల ఉధృతి స్థాయిని అనుసరించి సూచించిన పురుగు మందులను పిచికారీ చేసుకోవాలి.

పిలక దశలో - దుబ్బుకు 10 నుండి 15 దోమలు ఈనిక దశలో - దుబ్బుకు 20 నుండి 25 దోమలు ఆర్థిక నష్ట సహన పరిమితి స్థాయికి దోమ ఉధృతి ఉన్న ఎడల ఉధృతి స్థాయి అనుసరించి సూచించిన పురుగు మందులు పిచికారీ చేసుకోవాలి.

దోమ ఉధృతి దుబ్బుకు 50 నుంచి 100 వరకు ఉన్న ఎసిఫేట్ 75 ఎస్‌పి 1.5 గ్రాములు లేక ఇమిడాక్లోప్రిడ్ ఏథిప్రోల్ 80 డబ్ల్యూజి 0.25 గ్రాములు లేక బుప్రోఫేజిన్ 1.6 మల్లీ లీటర్ల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

దోమ ఉధృతి దుబ్బుకు 100 నుంచి 150 వరకు ఉంటే ఫ్లోనికామిడ్ 50 ఎస్‌జి 0.4 గ్రాములు, డైనోటేఫ్యూరాన్ 20 ఎస్‌జి 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

దోమ ఉధృతి దుబ్బుకు 150కు పైబడి ఉంటే పైమెట్రోజెన్ 50 డబ్ల్యూ జి 0.6 గ్రాములు, ట్రైఫ్లూమిజోపైరిమ్ 10 ఎస్‌జి 0.48 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అదుపులోకి వచ్చింది

తనకు ఉన్న ఎకరా 40 సెంట్ల విస్తీర్ణంలో ఎంటియు 1224 రకం వరి పండిస్తున్నా. సుడిదోమ సోకి పంట పాడవ్వడంతో వ్యవసాయ అధికారులను సంప్రదించా. వారు ఇచ్చిన సలహాలు, సూచనలతో మందులను పిచికారీ చేశాను. దీంతో సుడిదోమ తెగులు అదుపులోకి వచ్చింది.

- బాడాన అప్పారావు, రైతు దూసి

అధికారుల సూచనలు పాటించా

ఎకరా 10 సెంట్లు విస్తీర్ణంలో సాంబ రకం పంటను పండిస్తున్నా. సుడిదోమ తెగులు వచ్చి పైరు గోధుమ వర్ణం రంగులోకి మారింది. వ్యవసాయ అధికారిని సంప్రదించా. ఆయన పంట పొలాన్ని పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆయన సూచనల మేరకు పైరుకు మందులను పిచికారీ చేశా. దాంతో సుడిదోమను నివారించగలిగాను.

- గాలాల వెంకటలక్ష్మి, రైతు, రామచంద్రపురం

నష్ట నివారణకు చర్యలు

మున్సిపాలిటీ మొత్తం కలిపి పంట విస్తీర్ణం 11,266 ఎకరాలు. సుడిదోమ ఆశించిన విస్తీర్ణం 450 ఎకరాలు. సుడి దోమ ఆశించిన పంట పొలాల రైతులకు అవగాహన కల్పించి నష్ట నివారణ చర్యలు చేపడుతున్నాం.

- మెట్ట మోహనరావు, మండల ఎఒ

శ్రీకాంత్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

శ్రీకాంత్ పర్యటన

మెళియాపుట్టి: మండలంలో పెద్దపద్మాపురం, చాపర, జాడుపల్లి, సవరజాడుపల్లి గ్రామాల్లో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ ఆదివారం పర్యటించారు. పెద్దపద్మాపురానికి చెందిన రుకమందర్రావు, లింగాల సంజీవరావు అనారోగ్యం గురి కావడంతో వారిని పరామర్శించి ఓదార్చారు. ఎలకల చిలకమ్మా ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. చాపరకు చెందిన దేవా రామారావు, జాడుపల్లికి చెందిన ఎ.మల్లేశ్వరరావును, నర్సింగరావులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సవర జాడుపల్లి గ్రామస్తుల ఆహ్వానం మేరకు గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం గ్రామస్తులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రావు, గణపతి ప్రధాన్, బోసి రామారావు, జనపరెడ్డి కన్నబాబు, ఎస్.గౌరీష్, ఎంపిటిసిలు ఎస్.రవికుమార్, ఉర్లన రుషి తదితరులు పాల్గొన్నారు.

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

టెక్కలి : ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు కారణంగా రైతులు కరువు బారిన పడ్డారని, నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ గుడ్ల రామకృష్ణలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షాధారిత ప్రాంతాలతో పాటు కాలువ శివారు భూములకూ సాగునీరు అందలేదని పేర్కొన్నారు. దీనివల్ల వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల బీమా పథకాన్ని వర్తింపజేసి, ఎకరాకు రూ.30 వేలు చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీరితో పాటు నాయకులు పి.ధర్మారావు, చిక్కాల గోవిందరావు, తమిరి భుజంగరావు, గుడ్ల ఎర్రయ్య, తవిటినాయుడు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

రణస్థలం రూరల్: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని ఎస్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఇటీవల కర్నూల్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ విజేతలకు ఆదివారం బంటుపల్లి పంచాయతీ నడుకుడిటిపాలెంలో ఉన్న ఎస్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సెన్స్‌లో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బాల్ బ్యాడ్మింటన్ జిల్లా కార్యదర్శి పివిజి మురళి కృష్ణంరాజు, జాయింట్ సెక్రెటరీ పిహెచ్ అరుణ్ కుమార్, సెక్రెటరీ అజయ్ కుమార్, ఎపి స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన టీం సభ్యులను ఎస్ఇఆర్ స్కూల్ విద్యార్థులైన జాహ్నవి, హర్షినిని సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. చదువుతో పాటు ఆటల్లో రాణించిన విద్యార్థులు మాత్రమే జీవితం విసిరే సవాళ్లను అధిగమించగలరన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ రాజు మాట్లాడుతూ బాల్ బ్యాట్మెంటన్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ త్వరలో ప్రారంభం కానుందని దానిలో ఒక ఫ్రాంచైజ్‌ని ఎస్ఇఆర్ స్కూల్ తీసుకోవాల్సిందని, ప్రతిపాదించాలని కోరారు. స్కూలు చైర్మన్ ఈశ్వరరావు, డైరెక్టర్ తేజబాబు అంగీకరించారు.

ట్రోఫీని అందజేస్తున్న ఈశ్వరరావు

సాధికార యాత్రతో ఎమ్మెల్యేకు చెమటలు

మాట్లాడుతున్న ప్రకాష్

కవిటి: నాలుగున్నరేళ్లు ఆడుతూ, పాడుతూ గడిపేసిన ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళ అశోక్‌కు వైసిపి ప్రజా సాధికార యాత్ర విజయవంతం కావడంతో చెమటలు పడుతున్నాయని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు కవిటి సచివాలయం-1లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకోవడం, తుపాను డబ్బులు దాచుకోవడం తప్ప ప్రజలకు చేసింది శూన్యమని అన్నారు. ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీలో సర్పంచ్‌తో పాటు ఎంపిటిసి, వార్డు మెంబర్లను కూడా గెలిపించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. వైసిపి ప్రభుత్వంలో రూ.700 కోట్లతో కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు శుద్ధ జలం అందించామని అన్నారు. రూ.150 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, డయాలసిస్ రోగులకు రూ.10 వేల పింఛను, కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బందిని నియమించి కిడ్నీ బాధితులకు నిలిచామని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పూడి లక్ష్మణరావు, పూడి నీలాచలం, పాండవ శేఖర్, దువ్వు కృష్ణారెడ్డి, ఎలమంచి నీలయ్య, పులకల శ్రీరాములు, జల్లు యుగంధర్, దుద్ది ధర్మారావు, పిన్నింటి జయరాం పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు కుమార్ ఎంపిక

కుమార్

టెక్కలి : ఆల్‌ఇండియా యూనివర్సిటీ ఛాంపియన్ షిప్ తైక్వాండ్ పోటీలకు టెక్కలి క్రీడా వికాశ కేంద్రం నుంచి పూడి కుమార్ ఎంపికయ్యారని కోచ్ నర్సిపురం శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు నెలలో రాజస్థాన్ రాష్ట్రం జంజూలో జరగనున్న 87 కిలోల తైక్వాండ్ పోటీల్లో పాల్గొనున్నారని అన్నారు. కుమార్ ఎంపికపై కోచ్‌తో పాటు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వి.నాగేశ్వరరావు, జిల్లా క్రీడాశాకాధికారి డాక్టర్ శ్రీధర్‌రావులు అభినందించారు.

4న రోడ్డు దిగ్బంధం

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ప్రభుత్వ కళాశాల రహదారిలో గత ఏడాది కాలంగా మురుగునీరు, వర్షపు నీరు సమస్యతో స్థానికులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిస్కారం కోసం మూడు రోజులుగా రిలేదీక్షలు చేపట్టారు. రిలేదీక్షలు ముగింపు సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ మురుగునీరు సమస్యపై అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా మురుగునీరు సమస్య పరిష్కరించకపోతే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాలన్నారు. సమస్య పరిష్కరించకుంటే నవంబరు 4న రహదారి దిగ్బంధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వి.పైడిరాజు, నారాయణ రాజు, సత్యనారాయణ, కోట్ని శ్రీనివాసరావు, వాసు, బి.రమేష్, సాయి, ప్రమీలకుమారి, జయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని స్వప్న లాడ్జిలో ఢిల్లీకి చెందిన రాజ్ పుతే నరేష్ (25) ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు తాను టైల్స్ వ్యాపారం చేస్తానని చెప్పి ఈ నెల 26న స్వప్న లాడ్జిలో గది అద్దెకు తీసుకొని దిగాడు. 27వ తేదీ సాయంత్రం నుంచి మృతుడు కనిపించకపోవడంతో 28న ఉదయం లాడ్జీ యాజమాని గిరిబాబు కిటికీ తలుపులు తెరిచి చూశాడు. నరేష్ ఫ్యాన్‌కు తాడు వేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే లాడ్జి యాజమాని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఖాధిర్ సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుతాస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా ఉన్న రోడ్డు

రోడ్డుకు మోక్షమెప్పుడో?

ప్రజాశక్తి- మందస

మండలంలో కొర్రాయిగేటు నుంచి ఉద్దానం ప్రాంతం అల్లిమెరక వరకు నిత్యం రాకపోకలతో బిజీగా ఉండే ఈ రోడ్డులో రాళ్లు తేలిపోయాయి. దీంతో అధ్వానంగా తయారవ్వడంతో పాదచారులు, ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నుంచే బహడపల్లి, సువర్ణపురం, గుడ్డిభద్ర, రంగోయి, సరియాపల్లి, మకరజోల వంటి గ్రామాలతో పాటు ఉద్దానంలో చాలా గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి బిటి రోడ్డు వేయాలని కోరుతున్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఎంపీ దృష్టికి మత్స్యకారుల సమస్యలు

సంతబొమ్మాళి : వైసిపి ప్రభుత్వంలో మత్స్యకారులకు అన్యాయం జరుగుతుందని మత్స్యకారుల సంఘం నాయకులు సూరాడ ధనరాజు అన్నారు. ఈ మేరకు ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారులకు రావాల్సిన రాయితీలు అందడం లేదని, ప్రభుత్వం రాయితీలు వచ్చేలా కృషి చేయాలని కోరారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ త్వరలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, మళ్లీ మత్స్యకారులందరికీ పూర్వవైభవం వస్తుందని భరోసా ఇచ్చారు. కలిసిన వారిలో తెలుగు యువత మండల ఉపాధ్యక్షులు సూరాడ రాయుడు, మాజీ సర్పంచ్ శ్రీరంగం రాజులు, పిట్ట రాజులు ఉన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి రూరల్ : కావలి సమీపంలో విజయవాడ ఆటోనగర్ డిపో డ్రైవర్. బి.ఆర్ సింగ్‌పై దాడిని చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని టెక్కలి ఆర్‌టిసి డిపో ఎన్ఎంయు డిపో కార్యదర్శి బసవల ధనుంజయరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బస్సు నడుపుతున్న డ్రైవర్‌పై చెయ్యి పట్టి లాగి కొట్టడం ప్రజాస్వామ్యంలో ఎక్కడు ఉందని ప్రశ్నించారు. ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు.

కుశాలపురంలో అన్నదానం

ఎచ్చెర్ల: మండలంలోని కుశాలపురంలో దుర్గాదేవి నవరాత్రులు ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు, సరితారాణి దంతపలు ఆదివారం అన్నదానం చేపట్టారు. పరిసర గ్రామాలకు చెందిన రెండు వేల మంది యాత్రికులు పాల్గొన్నారు. ఏటా దుర్గాదేవి నవరాత్రులు సందర్భంగా అన్నదానం నిర్వహిస్తున్నామని శ్రీనివాసరావు తెలిపారు.

అన్నదానం చేస్తున్న సూర శ్రీను

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

ఎచ్చెర్ల : విద్యార్థులతో గ్రంథాలయాధికారి చంద్రశేఖర్

ప్రజాశక్తి- రణస్థలం

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని మంచి విద్యావంతులు కావాలని గ్రంథాలయాధికారిని పి.వరలక్ష్మి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయం ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు ముందుగా దినపత్రికల పఠనం, కథలు చదివించడం, దేశ నాయకుల జీవిత చరిత్రలను చడివించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పుస్తక పఠనం వలన భవిష్యత్‌లో సాధించాల్సిన విజయాలను ఎలా సాధించాలి, మంచి మార్గాన్ని అనుసరించి మంచి విజయాలను సాధించవచ్చో తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు: లావేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. భాస్కర శతకం, వేమన శతకంలో పద్యాలను విద్యార్థులతో చదివించారు. బాగా చదివిన ముగ్గురు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుండే శతకాలు, పద్యాలు, వాటి భావాలు నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయములో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో భాస్కర శతకం, వేమన శతకంలో పద్యాలను విద్యార్థులతో చదివించారు. బాగా చదివిన ఐదుగురు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను వరుసగా ధరణి, చాందిని, నిర్మల, కార్తీక్, నవ్యలకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మలిపెద్ది చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుండే శతకాలు, పద్యాలు వాటి భావాలు నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు సూర్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు సూరిబాబు, నవీన్, మధు, మహేష్, జగదీష్, సురేష్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌతు శిరీష పరామర్శ

పలాస : మండలంలోని రెంటికోటకు చెందిన ఎంపిటిసి మాజీ సభ్యులు మోహనరావు పెద్ద నాన్న గోవింద్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మృతుడి కుటుంబ సభ్యులను ఆదివారం పామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి విఠల్, మండల ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, టిడిపి నాయకులు ఉన్నారు.

'విశాఖ'లో ఎస్ఎల్‌సి

వేషధారణలో చిన్నారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో సాయి ప్రియదర్శిని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన నడుస్తున్న విశాఖ స్కూల్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫెరెన్స్ ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలు ప్రదర్శనలు ఇచ్చారు. ప్రాజెక్టులను చూసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులందరిలో కమ్యూనికేషన్ స్కిల్స్ బాగున్నాయని, స్కూల్‌లో తమ పిల్లలు చదవటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ పాఠశాల చైర్మన్ డాక్టర్ మధుసూదన్, వైస్ చైర్మన్ గీత, హెచ్ఎం పి.రామారావు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు.

నిజం గెలవాలి... చీకటి పాలన పోవాలి

ఇచ్ఛాపురం : నిరసన తెలుపుతున్న నాయకులు

కవిటి: వచ్చే ఎన్నికల్లో వైసిపి పతనం ఖాయమని టిడిపి మండల మణిచంద్రప్రకాష్ అన్నారు. చంద్రబాబు నాయుడు డిమాండ్‌కు నిరసనగా ఆదివారం రాత్రి స్థానిక బస్టాండ్ వద్ద జగనాసుర చీకటి పాలన పోవాలి... నిజం గెలవాల అంటూ కళ్లకు గంతలు కట్టుకొని తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పొందల కృష్ణారావు, బెందాలం రమేష్, సంతోష్ పట్నాయక్, బెందాలం విజయ్, పుల్లట సంతోష్, ప్రగడ మణి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం బస్టాండ్ వద్ద టిడిపి నాయకులు కాళ్ల జయదేవ్, కొండ శంకర్‌రెడ్డి, ఢిల్లీరావు, కాళ్ల దిలీప్, నందిక జాని, లోపింతి పద్మనాభం, కోటి, సహదేవ్‌రెడ్డి, కామేశ్వరరావులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు.

కొత్తూరు : స్థానిక నివగాం రోడ్డులో టిడిపి నాయకులు అగతముడి అరుణ్‌కుమార్ ఆధ్వర్యాన సైకో పాలన పోవాలి... బాబు రావాలని కళ్లకు గంతులు కట్టుకుని నిరసన తెలిపారు.

కళ్లకు గంతలతో టిడిపి నాయకుల నిరసన

కార్యక్రమంలో కులశేఖర్ ఆళ్వార్, చోడవరపు లోకేష్, రాము, వెంకటరమణ, ఎం.కృష్ణ, బి.శ్రీను, పెద్దిన అమర్, కె.రామారావు, పి.గోవింద, ఎ.గణేష్, రామారావు పాల్గొన్నారు.

మందస : మండలంలోని హరిపురం-బాలిగాం కూడలి వద్ద టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బావన దుర్యోధన ఆధ్వర్యాన కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో రట్టి లింగరాజు, దాసరి తాతారావు పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో జగనాసుర చీకటి పాలన పోవాలి... నిజం గెలవాల అంటూ కళ్లకు గంతలు కట్టుకొని నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్ పాల్గొన్నారు. మండలం బ్రాహ్మణతర్లలో బజార్ వీధి గాంధీ విగ్రహం వద్ద టిడిపి నాయకులు కళ్లకు గంతలు కట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వడ్డి యాదగిరి, అల్ల వెంకటరావు, బత్తల సూర్యం, ఎర్ర వెంకట్, అల్ల సోమేశ్, బమ్మిడి ఆనంద్, గరికి కృష్ణారావు, కొవ్వూరు ఢిల్లీ వడ్డి ఢిల్లీ, కొవ్వూరు ధర్మారావు, రఘుపాత్రుని బాలశంకర్, మెట్ట అప్పారావు, తుంగాన సింహాచలం పాల్గొన్నారు.

పలాస : బ్రాహ్మణతర్లాలో నిరసన తెలుపుతున్న నాయకులు

మెళియాపుట్టి : మండల కేంద్రంలో తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యాన కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో బసవ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

లావేరు: మండలంలో టిడిపి పిలుపుమేరకు ఆదివారం రాత్రి నిజం గెలవాలి, కళ్లు తెరిపిద్దాం కార్యక్రమం నిర్వహించారు. తాళ్లవలసలో మండల అధ్యక్షుడు ముప్పడి సురేష్, మహిళా రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత, లావేరులో ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర, తామాడలో క్లస్టర్ ఇన్‌ఛార్జి గొర్లె శ్రీనువాసరావు, బెజ్జిపురంలో టిడిపి ప్రధాన కార్యదర్శి పిన్నింటి మధుబాబు ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు.

శ్రీకాకుళం అర్బన్ : టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆధ్వర్యాన నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, గార టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొండు వెంకట రమణ మూర్తి, తూలుగు మాజీ సర్పంచ్ కొయ్యాన జగదీష్, శ్రీశయన సంఘ సాధికారిక కమిటి డైరెక్టర్ చింతనిప్పుల రాజేంద్ర పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ప్లకార్డులను ప్రదర్శిస్తున్న నాయకులు

లావేరు : నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి- కవిటి

ఉద్దానం ప్రాంతంలో పలువురు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రధాన శివాజీ సూచించారు. మండలంలోని బి.జి.పుట్టుగకు చెందిన గొనప సంతోష్ జన్మదినం సందర్భంగా రాగోలు జేమ్స్ సహకారంతో ఆదివారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కార్డియాలజిస్టు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ తేజ భరద్వాజ, డాక్టర్ హరిత, డాక్టర్ మౌనిక 341 మందికి పైగా రోగులను తనిఖీ చేశారు. అనంతరం ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. అంతేకాకుండా 31 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో పండి దేవేంద్రమూర్తి, పిరియా కృష్ణారావు, పుల్లట సంతోష్, పూడి రామారావు, శమల్ల సర్వేశ్వరరావు, శమల్ల ధనుంజయం, బొడ్డ వేణుగోపాల్, జెమ్స్ సిబ్బంది చిన్నారావు, లోకేష్ పాల్గొన్నారు.

కవిటి : రక్తదానం చేస్తున్న యువకుడు

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం నగర పరిధి తోటపాలెంలో సన్ రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మేరకు మందులు ఉచితంగా అందజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ రాజు, సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మాట్లాడుతున్న ఎర్రయ్య

31న రైతుసంఘం మహాసభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశంలో వ్యవసాయ రంగాన్ని సంక్షభంలోకి నెట్టి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న వైసిపి ప్రభుత్వం చోద్యం చూస్తున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింతు ఎర్రయ్య, చిక్కాల గోవిందరావులు ఆరోపించారు. వ్యవసాయ రంగంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారాన్ని కోరుతూ భవిష్యత్‌లో భావసారూప్యత గల రాజకీయపార్టీలతో జత కట్టి ఉద్యమిస్తామన్నారు. ఆదివారం నగరంలోని క్రాంతిభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. నగరంలోని రామలక్ష్మణ జంక్షన్ వద్ద గల డిఎన్‌ఆర్ క్రాంతి భవనంలో ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా మహాసభ జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్రస్థాయి నాయకులు హాజరు కానున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పెద్దఎత్తున రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు హాజరు కావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో గుడ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

డీలర్ అవకతవకలపై విచారణ

భామిని: మండలంలోని మాణిగ పంచాయతీలోని గల రేషన్ షాపు డీలర్ అవకతవకలపై తహశీల్దార్ అప్పారావు, సిఎస్‌డిటి మధు, విఆర్ఒ బి.గోపాల్ ఆదివారం విచారణ నిర్వహించారు. డీలర్ గత కొంతకాలంగా సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా, లబ్దిదారుల నుండి ముద్రలు వేసి బియ్యం పంపిణీ చేయకపోవడం, పంచదార, కంది పప్పు లబ్దిదారులకు అధిక ధరకు ఇవ్వడం, కొందరికి పూర్తిస్థాయిలో ఇవ్వకపోవటం వంటి అంశాలపై రేషన్ షాపుల పరిధిలోని లబ్దిదారులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి అంశాలను రికార్డు చేశారు. ఈ సందర్భంగా ఆ షాపు రేషన్ డీలర్‌ను పూర్తి స్థాయిలో తొలగించాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో మాణిగ సర్పంచ్ కొండగొర్రి మంగ, గజపతి, సుబ్బారావు, సుమన్, చంటి వున్నారు.

పైడితల్లమ్మ పండగకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: ఎస్‌కోట డిపో నుంచి విజయనగరం పైడితల్లమ్మ పండుగను పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు స్థానిక డిపో మేనేజర్ కె. రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రత్యేక బస్సులు ఆదివారం నుంచి అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్. కోట నుండి జామి మీదుగా విజయనగరం, ధర్మవరం మీదుగా విజయనగరం, కొత్తవలస మీదుగా విజయనగరానికి భక్తుల రద్దీని బట్టి ఏర్పాటు చేశామన్నారు. ఎస్. కోట నుండి విశాఖ వెళ్ళు ప్రయాణికుల కోసం సోమవారం ఉదయం 4గంటలకు కొత్తగా ఒక అల్ట్రా డీలక్స్ బస్సును, అలాగే విశాఖ నుండి ఎస్. కోట మీదుగా అరకునకు కూడా ఉదయం 4.45 గంటలకు ఒక ఆల్ట్రా డీలక్స్ బస్సును సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బస్సుయాత్రతో మరోసారి మాయ

వేపాడ: రాష్ట్రంలో సామాజిక బస్సు యాత్రతో వైసిపి నాయకులు మరోసారి ప్రజలను మాయ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఈ యాత్రలను ప్రజలు నమ్మడం లేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. తన స్వగ్రామంలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ బస్సు యాత్ర చేస్తూనే మరోవైపు నెల్లూరులో బస్సు డ్రైవర్‌పై వైసిపి గుండాలు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఈ రాష్ట్రంలో సామాన్యులకు స్వేచ్ఛగా బ్రతికే హక్కు లేదా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వ విధానాలను చూస్తుంటే జగన్మోహన్ రెడ్డికి రాజ్యాంగం అన్న, న్యాయస్థానాల అన్నా గౌరవం లేదన్నారు. ప్రతి పక్ష నాయకులు ప్రజా సమస్యలపై ర్యాలీలు చేస్తే పోలీసులను ప్రయోగించి గృహ నిర్భందాలు చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రానున్న ఎన్నికల్లో కచ్చితంగా జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు ఓడిస్తారని అన్నారు.

పలువురికి ఆర్థికసాయం

కవిటి: మండలంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చింతామణి ట్రస్టు (హైదరాబాదుకు చెందిన ఇందిరాదేవి, చింతామణి కుమార్ ఆర్థిక సాయంతో) సేవలు శ్లాఘనీయమని వక్తలు అన్నారు. కవిటి బీచ్ రోడ్డులో నిర్మిస్తున్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ సామగ్రికి చింతామణి ట్రస్టు సభ్యులు ఆదివారం రూ.1,18,000లు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాండవ శేఖర్, ఆరింగి మధు, బెందాలం వెంకటేశ్వరరావు, పొల్లాయి లక్ష్మణమూర్తి, బెందాళం రమణమూర్తి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : చెక్కును అందజేస్తున్న సభ్యులు

వజ్రపుకొత్తూరు : కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేటకు చెందిన పుక్కళ్ల శివ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో కుడి కాలు విరిగిపోయింది. దీంతో మంచానికి పరిమితమై వైద్య ఖర్చులకు కుటుంబం ఇబ్బందులు పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న కొమరల్తాడకు చెందిన ఉద్దానం అభ్యుదయ సేవాసమితి సభ్యులు స్పందించి రష్యా గల్ఫ్ కార్మికులు నుంచి రూ.8 వేలు విరాళాలు సేకరించారు. వాటిని బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తామాడ లక్ష్మణరావు, మండల మహేష్, చింత రూపవతి, కొంకి మోహిని పాల్గొన్నారు.

మండలంలోని పెద్దమురహరిపూరం సాగర్ కాలనీలో నివాసముంటున్న భద్రాచలం తారకేశ్వరరావుకు యువతరం సేవా సమితి సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. బాధితుడు ఇంటికి వెళ్లి రూ.20 వేలు చెక్ అందించారు. బాధితుడు కొంత కాలంగా గుండెకు సంబంధించి విపరీతమైన ఆయాసం దగ్గు తో బాధపడుతున్నడు. వైద్య ఖర్చుల కోసం అండగా నిలిచారు. కార్యక్రమంలో యువతరం సేవా సమితి అధ్యక్షులు చింత మురళి, ఇన్‌ఛార్జిలు గోరకల అశోక్, బడే దనుంజయ్, కోడి నిహల్, గోరకల సునీల్, గోరకల శరత్, కలిశెట్టి సింహాచలం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990 నుంచి 95 మధ్య చదువుకున్న ఎస్ఎస్‌సి బ్యాచ్ ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 141 మంది విద్యార్థులు అపురూప ఆత్మీయ కలయికతో సందడి నెలకొంది. సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండటం చాలా గర్వంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు కలిసి రూ. 50వేలతో స్కూల్ అభివృద్ధి కోసం స్కూల్ హెచ్ఎం హరినాధకు అందజేశారు. విద్యార్థులు తమ బాల్యంలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కరోనా సమయంలో మా బ్యాచ్ ఎన్నో సహాయ సహకారాలు చేసిందన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ఆర్థికంగా సహాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో వావిలపల్లి అచ్యుతరావు, శ్రీనివాసరావు, తిరుమల, సురేష్ కుమార్, విజయ్ గణపతి, వెంకటేష్, ప్రసాద్, పొన్నాడ మోహనరావు, డివిఎ.నాయుడు, సంతోష్, బాలచంద్ర, కల్పన, వినీత్ కుమారి, రూప, శ్రీధర్, మామిడి వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : 43 ఏళ్ల విరామం తరువాత టంగుటూరి ప్రకాశం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నాగావళి హోటల్లో నిర్వహించారు. ఆనాటి బాల్యంలో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒరేయ్... ఒసేయ్ సంబోధనలతో వేదిక వేడుకగా మారింది. 1979, 1980 విద్యా సంవత్సరాల విద్యార్థిని, విద్యా ర్థులు సంఘటితంగా ఏర్పడి అప్పట్లో తమకు విద్యా బోధనలు నేర్పిన నలుగురు గురువులను ఆత్మీయంగా సత్కరించడం విశేషం. నరసయ్య శర్మ, బి సింహగిరి, కెఎస్ ప్రసాద్, సీతామహాలక్ష్మి టీచర్లను సన్మానించారు. 43 ఏళ్ల విరామం తర్వాత జరిగిన ఈ అపూర్వ కలయికలో గురువులకు పాదాభివందనం చేసి పుష్పాలతో ఆశీర్వచనం స్వీకరించారు. చిన్ననాటి జ్ఞాపకాల గుర్తుచేసుకుంటూ ఆనాటి టీచర్ల బోధనలు గుర్తు చేసుకున్నారు.

నీరు నిల్వతో ప్రమాదకర ప్రయాణం

ఆక్రమణల వల్ల దుస్థితి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

నిత్యం రహదారిపై నీరు నిల్వఉండడంతో వాహనదారులు, ప్రజలు ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే బెంబేలెత్తిపోతున్నారు. సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస గ్రామ జంక్షన్ నుండి బూర్జ మండలం సిఎస్‌పి రోడ్డుకు అనుసంధానం చేస్తూ ఏర్పాటుచేసిన బిటి రోడ్డుపై ప్రయాణం అంటే నిత్యం నరకమేనని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. రొట్టవలస గ్రామ శివారున బిటి రోడ్డుపై నుండి పంట కాలువలకు వెల్లాల్సిన నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో వాహనదారులు విన్యాసాలు చేస్తూ ప్రయాణాలు కొనసాగించాల్సి వస్తుందని వాపోతున్నారు. రహదారికి పక్క నుండి కాలువల ద్వారా వెళ్లాల్సిన సాగునీరు కాలువలను కొంతమంది వ్యక్తులు ఆక్రమించి కప్పేయడంతో ఈ దుస్థితి దాపురించిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పలుమార్లు మండల అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఉదాసీ నంగా వ్యవహరిస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఈ రహదారి గుండా బూర్జ మండలంలోని కొరగాం, బోరగవలస, కటకమయ్యపేట గ్రామాలకు వెళ్లే ప్రజలతో పాటు పంట పొలాలకు వెళ్లే రైతులు, మునగవలస క్వారీకి వచ్చి వెళ్లే

కార్మికులు పలుమార్లు ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి తగు చర్యలు చేపట్టి ప్రజల సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

పిచ్చిమొక్కలతో ప్రమాదకరంగా ఉన్న మలుపు

ఈ మలుపు ప్రమాదకరం

ప్రజాశక్తి- బూర్జ

పాలకొండ పట్టణం నుంచి బూర్జ మండలం అల్లెన గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. వై.పర్త గ్రామ సమీపంలో ఉన్న భారీ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపు ఇరువైపులా దట్టమైన పిచ్చి మొక్కలు ఉండడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, వేగ నిరోధకాలు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పరామర్శిస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' పరామర్శ

హిరమండలం : మండలంలోని అవలంగికి చెందిన జెడ్‌పిటిసి మాజీ సభ్యులు లోలుగు లక్ష్మణరావు బైక్ ప్రమాదంలో గాయపడ్డారు. శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పాతపట్నం నియోజకవర్గ టిడిపి నాయకులు, సామాజిక వేత్త మామిడి గోవిందరావు శనివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

రమేష్...

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలో 10వ వార్డు మెట్టెక్కివలస మండలవీధి టిడిపి సీనియర్ నాయకుడు కారుణ్య ధర్మారావు ఆరోగ్య పరిస్థితి బాగా లేదన్న విషయం తెలుసుకొన్న టిడిపి జిల్లా కార్యాలయ సమన్వయ కార్యదర్శి, సీనియర్ నాయకుడు మొదలవలస రమేష్ ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలన్నారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు మురళి, రాడ విజయ్ కుమార్, గొండు కరుణాకర్, కారుణ్య జగబంధు, బోసు భాస్కరరావు, రీసు చిరంజీవి ఉన్నారు.

గృహ నిర్బంధం అప్రజాస్వామికం

శ్రీకాకుళం అర్బన్ : జిపిఎస్ రద్దు చేసి పాత ఫెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, దీర్ఘకాలిక విద్యారంగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) ఆధ్వర్యాన సోమవారం విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు హాజరు కాకుండా ముందస్తు గృహ నిర్భందించడం అప్రజాస్వామికమని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చలపతిరావు ఆరోపించారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసు అధికారులు అనుమతించి, ధర్నాకు వెళ్లకూడదని నిరోధిస్తూ నోటీసులివ్వడం, గృహనిర్భందం సరికాదన్నారు. ఎపిటిఎఫ్ నాయకులు బల్లెడ లక్ష్మణమూర్తి, వాన కామేశ్వరరావు, టి.చలపతిరావు, సన్నశెట్టి రాజశేఖర్, చింతాడ దిలీప్ కుమార్, బండారు సుమలత, నానుబాల ప్రభాకరరావు, బల్లెడ రవి, పొన్నాడ బాలాజీరావులకు నోటీసులు ఇచ్చి ధర్నాకు హాజరు కాకుండా అడ్డుకున్నార న్నారు. ఇటువంటి చర్యలతో ఉద్యమాలను ఆపలేరన్నారు.

తెర్లాంలో జగనన్నకు చెబుదాం

తెర్లాం: నవంబరు 8న స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి హాజరవుతారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.